డీలక్స్ బస్ లక్కీడ్రా విజేతల ఎంపిక

- ఆర్టీసీ డిపో మేనేజర్లు మనోహర్, మురళీకృష్ణ
- నేడు బహుమతుల ప్రదానం

కలెక్టరేట్: లక్కీ డ్రా ద్వారా విజేతలను ప్రకటిస్తున్న డీఎం మనోహర్

కలెక్టరేట్/వేములవాడ రూరల్, జూలై 17: టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డీలక్స్ బస్సులలో ప్రయాణించిన మహిళలకు గిఫ్ట్ స్కీమ్ ప్రవేశపెట్టగా, సిరిసిల్ల, వేములవాడ డిపో మేనేజర్లు మనోహర్, మురళీకృష్ణ ఆధ్వర్యంలో లక్కీడ్రా విజేతలను ప్రకటించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 15రోజులకోసారి డ్రా తీయాల్సి ఉండగా, జూలై 1 నుంచి 15 మధ్య ప్రయాణించిన మహిళా ప్రయాణికులు లక్కీ డ్రాలో ఎంపికయ్యారని వారు చెప్పారు. సిరిసిల్ల డిపో నుంచి ఎం సుచిత్ర, ఎల్ సుమలత, స్వప్న సిరిసిల్ల–వరంగల్ డీలక్స్ బస్సు విజేతలుగా, కే లహరి, సుంక లావణ్య, ఏ పద్మ సిరిసిల్ల–కరీంనగర్(నాన్‌స్టాప్) డీలక్స్ బస్సు విజేతలుగా గెలుపొందారని డీఎం మనోహర్ తెలిపారు. కాగా, విజేతలకు గురువారం సిరిసిల్ల పాత బస్టాండ్‌లో విశాల షాపింగ్ మాల్ సౌజన్యంతో బహుమతులు అందజేస్తామని ఆయన వెల్లడించారు. అలాగే వేములవాడ ఆర్టీసీ డీలక్స్ బస్సులలో ప్రయాణించిన అఖిల్, అనంతుల లలిత, సంధ్య లక్కీడ్రాకు ఎంపికైనట్టు డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. విజేతలకు విశాల షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో బహుమతులు అందిస్తామని ప్రకటించారు. ఇక్కడ ట్రాఫిక్ ఇన్‌చార్జి సత్యనారాయణ, పీఆర్వో శ్రీనివాస్ ఉన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

- నేడు ₹లక్షలోపు రుణాలు ఉన్నవారికి మాఫీ
- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా
- వ్యవసాయశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టరేట్, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అర్హులైన రైతులందరికీ లక్ష రూపాయల లోపు రుణాలు మాఫీ చేయనున్నట్టు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ హాల్‌లో జిల్లా వ్యవసాయాధికారులతో రైతు రుణమాఫీ పథకం అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 23,779 రైతులకు రుణాలు మాఫీ చేయనున్నట్టు వెల్లడించారు. వేములవాడ మండలం మారపాక, చందుర్తి, బోయినపల్లి మండలం కొదురుపాక, కోనరావుపేట మండలం నిజామాబాద్, వేములవాడ అర్బన్ మండలం హన్మాజీపేట, తంగళ్లపల్లి మండలం తాడూరు, ముస్తాబాద్ మండలం బంధనకల్, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, ఇల్లంతకుంట, వీర్నపల్లి, రుద్రంగి రైతు వేదికల్లో రుణమాఫీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు వివరించారు. వ్యవసాయశాఖ అధికారులు జిల్లాలోని రైతు వేదికలు, గ్రామ పంచాయతీ భవనాల వద్ద రైతుల రుణమాఫీ వివరాల జాబితా ప్రదర్శించాలని ఆదేశించారు. సదరు జాబితాను రైతులు సరిచూసుకోవాలని కోరారు. రైతు వేదికల వద్ద కార్యక్రమాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం మధ్యాహ్నం 3.30గంటలకు సందేశం ఇవ్వనున్నారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమాలకు రైతులు, అధికారులు, నేతలు హాజరుకావాలని కోరారు.

నోడల్ అధికారుల నియామకం: డీఏవో

జిల్లాలోని వివిధ మండలాల్లోని రైతు వేదికల వద్ద గురువారం చేపట్టబోయే రైతు రుణమాఫీకి నోడల్ అధికారులను నియమించినట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేములవాడ మండలం మారుపాక రైతువేదిక నోడ్ అధికారిగా జీ సాయికిరణ్(ఎంఎవో), చందుర్తికి సీహెచ్ దుర్గారాజ్ (ఎంఎవో), బోయినపల్లి మండలం కొదురుపాకకు కే ప్రణీత(ఎంఎవో), కోనరావుపేట నిజామాబాద్‌కు కే వెంకట్రావమ్మ (ఎంఎవో), వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలకు టీ శ్రీనివాసరావు (ఏడీఏ), తంగళ్లపల్లి మండలం తాడూరుకు జీ కృష్ణవేణి (ఏవో), గంభీరావుపేట మండలం నర్మాలకు టీ మహేశ్వరి (ఏవో), ముస్తాబాద్ మండలం బంధనకల్‌కు జీ వెంకటేశ్ (ఎంఎవో), సిరిసిల్ల మండలం చంద్రంపేటకు కే సందీప్ (ఎంఎవో), ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు జగన్(ఏఎస్ఎవో), ఇల్లంతకుంట మండలం ఇల్లంతకుంటకు ఎం సురేశ్‌రెడ్డి (ఎంఎవో), వీర్నపల్లికి సీహెచ్ భూమిరెడ్డి (ఎంఎవో), రుద్రంగికి వీ గోవర్ధన్‌ను (హెచ్‌వో) రైతు వేదిక నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్టు వెల్లడించారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ
- కేడీసీసీబీ చైర్మన్ కొండూరితో కలిసిగాలిపెల్లిలో పెట్రోల్ బంక్ పునఃప్రారంభం

ఇల్లంతకుంట: పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

ఇల్లంతకుంట, జూలై 17: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రాథమిక సహకార సంఘాల సేవలందిస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు గాలిపెల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్‌ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ సహకార సంఘం 2004లో నష్టాల్లో ఉండేదని, అప్పటి నుంచి దినదినం రైతుల సహకారంతో ప్రస్తుతం వంద కోట్ల లాభాల బాటలో నడుస్తున్నదన్నారు. ప్రతి రైతుకు అన్ని విధాలుగా అండగా ఉండాలనే నాణ్యమైన ఇంధనం అందించడానికి భారత్ పెట్రోలియం పంప్‌ను తిరిగి ప్రారంభించినట్టు చెప్పారు. సహకార సంఘం అభివృద్ధిని ఇతర దేశాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి విధి విధానాలను అడిగి తెలుసుకుంటున్నారని, ఇంత అభివృద్ధి జరగడానికి రైతుల సహకారం, సిబ్బంది పనితీరు అభినందనీయమన్నారు. ప్రతి రైతుకు అందుబాటులో ఉండి వారికి అండగా ఉంటామన్నారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్లు తిరుపతిరెడ్డి, అన్నాడి అనంతరెడ్డి, మాజీ ఎంపీపీలు ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య, మాజీ ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్య, సింగిరెడ్డి శ్యామలాదేవి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ తిరుపతి, బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, డైరెక్టర్లు ఉన్నారు.

సభ్యుల శ్రేయస్సే లక్ష్యం

గంభీరావుపేట, జూలై 17: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యుల శ్రేయస్సే లక్ష్యంగా మెరుగైన సేవలందిస్తున్నామని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సింగిల్‌విండో ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సహకార సంఘాల ఆధ్వర్యంలో 42బంక్‌లను ఏర్పాటు చేశామన్నారు. గంభీరావుపేట సంఘం గతంలో నష్టాల్లో ఉండేదని.. ప్రస్తుతం రూ.30కోట్ల లావాదేవీలు చేపడుతూ సభ్యులకు రుణాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ భారత్ పెట్రోలియం సేల్స్ మేనేజర్ చరణ్‌జిత్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎర్ర రామాంజగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు అహ్మద్, మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్, సర్పంచ్ కటకం శ్రీధర్, సీఈవో రాజిరెడ్డి, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, లింగన్నగారి దయాకర్‌రావు, గంధ్యాడపు రాజు, చెవుల మల్లేశం, రాజనర్సు, బాల్‌రెడ్డి, అంజిరెడ్డి, రాజిరెడ్డి, వెంకటియాదవ్, స్వామి, డైరెక్టర్లు, సభ్యులు ఉన్నారు.

వేతనాల జాప్యంపై నిరసన

వేములవాడ, జూలై 17: రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో పని చేస్తున్న ఒప్పంద కార్మికులు బుధవారం రాజన్న ఆలయ ఈవో ఆఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జూన్ నెలకు సంబంధించిన వేతనం ఇంతవరకు చెల్లించలేదని, 40మంది కార్మికులు నిరసన తెలిపారు. శానిటేషన్, గోశాల, ఇంజినీరింగ్ విభాగాల కార్మికులు నిరసన తెలుపగా, విషయం తెలుసుకున్న ఈవో వినోద్‌రెడ్డి సంబంధిత ఏజెన్సీలను మందలించినట్లు తెలిసింది. ఇకపై ప్రతినెల 5వ తేదీలోపు వేతనం చెల్లించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

ఘనంగా తొలి ఏకాదశి

చందుర్తి: ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్: రాజన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, జూలై 17: ఆషాడ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని వేములవాడ రాజన్న ఆలయం బుధవారం సందడిగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. ఉదయం 5గంటలకు ప్రాతఃకాల పూజల అనంతరం ప్రధాన అర్చకుడు నమిలకొండ ఉమేశ్ ఆధ్వర్యంలో స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ అనుబంధ దేవాలయాల పరివార దేవతలకు అర్చనలు, విరలేశ్వర స్వామివారికి పంచోపనిషత్తుల ద్వారా అభిషేక పూజలు, మహాపూజ చేశారు. అద్దాల మండపంలో వేద పండితులు వేద పారాయణం నిర్వహించారు. కాగా, తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన సంగీత కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను సత్కరించారు.

చందుర్తి, జూలై 17: మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి అర్చకులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం స్వామివారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అఖండ భజనలో పాల్గొన్నారు.

రుద్రంగి, జూలై 17: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయ, బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఇండ్లలో పిండి వంటలు చేసుకొని సహపంక్తి భోజనం చేశారు.

భీమేశ్వరాలయంలో సందడి

వేములవాడ టౌన్, జూలై 17: రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయ ప్రాంగణం బుధవారం సందడిగా మారింది. పట్టణంలోని బ్రాహ్మణ మహిళలు, చిన్నారులు ఆటపాటలతో వేడుకలు జరుపుకొన్నారు. తొలి ఏకాదశికి భీమేశ్వరాలయంలో మహిళలందరం కలిసి ఆటపాటలతో గడపడం అనాధిగా వస్తున్న ఆచారమని కొందరు మహిళలు చెప్పారు. ఖోఖో, క్విజ్, అంత్యాక్షరి, పాటల పోటీలు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకుని ప్రత్యే పూజలు తెలిపారు.

వేములవాడ టౌన్: భీమేశ్వరాలయంలో వేడుకలకు హాజరైన మహిళలు

నేడు జిల్లాలో ఎస్టీ కమిషన్ సభ్యుల పర్యటన

కలెక్టరేట్, జూలై 17: జిల్లాలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోటు హుస్సేన్‌నాయక్ శుక్రవారం పర్యటించనున్నారు. ఉదయం 6గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా వేములవాడకు చేరుకుంటారు. వేములవాడ రాజన్న దర్శనం తర్వాత ఉదయం 11 గంటలకు సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీ ఇతర జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. లంచ్ స్వీకరించి మధ్యాహ్నం 3 గంటలకు ట్రైబల్ ఏరియాలో క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని, అనంతరం సాయంత్రం 4గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

యువకుడి అరెస్ట్

వేములవాడ రూరల్/చందుర్తి, జూలై 17: గంజాయి కేసులో ఆరు నెలల నుంచి తప్పించుకొని తిరుగుతున్న ఓ యువకుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్టు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గత జనవరి 31న గంజాయితో పట్టుబడిన నలుగురిపై కేసు నమోదు చేయగా, అమీర్, కాల్వ వెంకటేశ్, పండుగ అభి, రవి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు వారు చెప్పారు. ఆ నలుగురిని విచారించగా, చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన తోట అఖిల్ నుంచి కొనుగోలు చేసేవాళ్లమని చెప్పారు. అప్పటి నుంచి అఖిల్ తప్పించుకొని తిరుగుతున్నాడని తెలిపారు. ఈ క్రమంలో బుధవారం చందుర్తిలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
OLD AGE HOME
★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571

ఘనంగా మొహర్రం వేడుకలు

సిరిసిల్ల రూరల్: దేశాయిపల్లెలో మొహర్రం వేడుకల్లో నేతలు

వేములవాడ రూరల్: నాంపల్లిలో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

ఎల్లారెడ్డిపేట, జూలై 17: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. బుధవారం గ్రామాల్లోని కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన పీరీలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆటపాటల మధ్య ఊరేగింపుగా పీరీలు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

సిరిసిల్ల రూరల్, జూలై 17: తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు దేశాయిపల్లె, బద్దినపల్లి, జిల్లెల్ల, సారంపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పీరీల వద్ద పూజలు చేశారు. ఇక్కడ ఎండీ సంసేర్, ఎండీ హమీద్, ఉస్మాన్, హైదర్, ఇమాం, తదతరులు ఉన్నారు.

ఇల్లంతకుంట, జూలై 17: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారం జరుపుకొన్నారు. కుల మతాలకు అతీతంగా పీరీలను ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వేములవాడ రూరల్, జూలై 17: మున్సిపల్ పరిధిలోని నాంపెల్లితోపాటు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పీరీలను డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ఇంగిలీకం ముల్లే ఇబ్బంది తెచ్చింది

- చేపల వేటలో ఘటన
- వెంకటాపూర్‌లో బాధితుడు

ఎల్లారెడ్డిపేట, జూలై 17: తోటి మత్స్యకారులతో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారుడికి చేప ముల్లే ఇబ్బందులు తెచ్చిన ఘటన వెంకటాపూర్‌లో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాపూర్‌కు చెందిన బోయిని బాబు అనే మత్స్యకారుడు ఆరో రోజుల క్రితం గ్రామంలోని బావజ్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఇంగిలీకం(చేప)కు ఉన్న ముల్లు కాలుకు గుచ్చుకున్నది. దీంతో మరునాడు కాలు వాపువచ్చింది. చిన్న సమస్యే అనుకున్నప్పటికీ.. కాలు మరింత వాపు రావడంతో సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాబుకు వైద్య ఖర్చుల కోసం రూ.80వేల వరకు అప్పు అయిందని ఆవేదనగా తెలిపారు. మత్స్యకారుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వెంకటాపూర్ మత్స్యకార సంఘం సభ్యులు కోరారు.

సిరిసిల్ల దవాఖానలో చికిత్స పొందుతున్న బాబు

విరలేశ్వరుడికి ప్రత్యేక పూజలు

విరలేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, జూలై 17: ఆషాడ శుద్ధ ఏకాదశి తొలి ఏకాదశిని పురస్కరించుకుని రాజన్న ఆలయంలో బుధవారం రాత్రి విరలేశ్వర స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో గల కోటిలింగాల సముదాయంలో ఉన్న శ్రీ విరలేశ్వరస్వామివారికి పంచోపనిషత్తుల ద్వారా అభిషేకం, మహాపూజ ఘనంగా నిర్వహించారు. ఇక్కడ ఈవో వినోద్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ గణేశ్

ముస్తాబాద్ జూలై 17: ముస్తాబాద్ ఎస్ఐగా గణేశ్ బుధవా రం బాధ్యతలు స్వీకరించారు. ఇదివారకు ఇక్కడ పని చేసిన శేఖర్ రెడ్డిని కరీంనగర్‌కు బదిలీ చేయగా, కామారెడ్డి జిల్లా దొమకొండ ఎస్ఐ గణేశ్ ఇక్కడికి బదిలీపై వచ్చి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రలను పరిరక్షిస్తామని, నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇద్దరిపై కేసు

వేములవాడ రూరల్, జూలై17: లింగంపల్లి గ్రామానికి చెందిన సుమన్‌రెడ్డి, మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లింగంపల్లి మూలవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యాజమానుల వద్ద డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

వేములవాడ రూరల్, జూలై17: మారుపాక నందికమాన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అగ్రహారం వద్ద పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన పఠాన్, ధనుంజయ్ దిచక్ర వాహనంపై నందికమాన్ వైపు వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన కారు వీరిని ఢీకొట్టడంతో పఠాన్, ధనుంజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో హైదరబాద్‌కు తరలించారు.

పరిష్కార వేదికలు కావాలి

వేములవాడ రూరల్, జూలై 17: ప్రజా సమస్యలకు పరిష్కార వేదికలుగా పార్టీ కార్యాలయాలు పని చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని చెక్కపల్లి రోడ్డులో వేములవాడ రూరల్ మండల పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఇక్కడ పార్టీ మండలాధ్యక్షుడు వకుళభరణం శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

బీరయ్యకు ఘనంగా పస్క బోనాలు

పొత్తూరులో బీరయ్యకు పస్క బోనాలు తీస్తున్న పెద్ద కురుమ పోలె శ్రీనివాస్

ఇల్లంతకుంట, జూలై 17: తొలిఏకాదశిని పురస్కరించుకుని పొత్తూరు గ్రామంలో గొల్ల కురుమలు పస్క బీరయ్యకు బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గు పూజారుల డోలు, డప్పుచప్పుళ్ల మధ్య పెద్ద కురుమ నెత్తిన బోనం ఎత్తుకుని ఊరేగింపుగా బీరయ్య ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించుకున్నారు. ఇక్కడ కురుమ సంఘం జిల్లా విద్యా కమిటీ అధ్యక్షుడు పోలె శ్రీనివాస్, గొల్ల కురుమలు తదితరులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

మేడిపల్లి, జూలై 17: భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మరిపేటకు చెందిన తీపిరి శ్రావణి అలియాస్ మాలతి(25) కొడుకు సహర్ష మంగళవారం కడుపునొప్పితో బాధపడగా, చికిత్స కోసం డాక్టర్ వద్దకు తీసుకెళ్లే విషయంలో భర్తతో గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మాలతి గడ్డి మందు తాగింది. దవాఖానకు తరలించగా, చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందింది. మాలతి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సుధాకర్

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు

బోయినపల్లి, జూలై 17: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఉమ్మడి జిల్లాకు చెందిన నేరెళ్ల శారద నియామకం కాగా, బుధవారం హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కమిటీ సభ్యుడు కొట్టెపల్లి సుధాకర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ చైర్‌పర్సన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

వేములవాడ రూరల్, జూలై 17: అచ్చనపల్లి గ్రామానికి చెందిన మాదాసు విజయ్ (27) గల్ఫ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్ ఆరేండ్ల నుంచి మస్కట్ వెళ్లివస్తున్నాడు. ఆరు నెలల క్రితమే ఇంటికి వచ్చి వెళ్లాడు. అక్కడ ఓ అమ్మాయితో సహజీవనం చేస్తుండగా, ఇద్దరి మధ్య మనస్పార్థాలు రావడం గొడవైంది. దీంతో మనస్తాపం చెందిన విజయ్ ఆదివారం రాత్రి తాను ఉండే గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో బోరున విలపించారు.

మాదాసు విజయ్